సాక్షి
నిర్మల్
శనివారం । 21 । అక్టోబర్ । 2023



## భక్తజన బాసర

- వివరాలు 2లో

చదువుల తల్లి క్షేత్రమైన బాసరలో శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. దసరా ఉత్సవాల్లో అత్యంత శుభ ముహూర్తమైన మూలనక్షత్రం పర్వదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.





## న్యూస్‌రీల్

### సమస్యలు పరిష్కరిస్తేనే ఓటేస్తాం..!

- అభ్యర్థులెవరూ మా ఊరికి రావొద్దు
- అంబుగామ గ్రామస్తుల నిర్ణయం
- పాలకుల తీరుకు నిరసనగా ర్యాలీ


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

**కుంటాల:** తమ ఊరి సమస్యలు పరిష్కరిస్తేనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయాలని మండలంలోని అంబుగామ గ్రామస్తులు నిర్ణయించారు. పాలకుల తీరుకు నిరసనగా శుక్రవారం గ్రామంలో ప్లకార్డులు ప్రదర్శించి, ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు, వంతెనలు లేక వర్షాకాలంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. తమ గ్రామానికి పిల్లనివ్వడాకి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. బస్సు సౌకర్యం లేక పిల్లలు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా వెళ్తున్నారని తెలిపారు. ఈ సమస్యలపై కలెక్టర్ గ్రామానికి వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరూ తమ గ్రామానికి రావొద్దని సూచించారు. నిరసనలో సర్పంచ్ ఆడే బాపూరావు, ఎంపీటీసీ రాథోడ్ సవితమోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన ఖనాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


రాహుల్ కాంగ్రెస్‌లో చేరిన రేఖానాయక్

**ఖానాపూర్:** ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్మూర్‌లో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఆ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీ సమక్షంలో పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునేలా ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా గురవేస్తామన్నారు.

**నారాయణ్‌రావుపటేల్..**

**భైంసాటౌన్:** ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావు పటేల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొద్ది రోజులుగా ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరతానంటూ సంకేతాలిచ్చారు. ఎట్టకేలకు శుక్రవారం ఆర్మూర్ జరిగిన కార్నర్ మీటింగ్‌లో రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయన తనయుడు అఖిలేశ్‌పటేల్ సైతం కాంగ్రెస్‌లో చేరారు.

**పటేల్ ప్రస్థానమిలా...**

1994లో టీడీపీ నుంచి పోటీ చేసి 32,902 ఓట్ల మెజార్టీతో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డెన్న చేతిలో 850 ఓట్ల తేడాతో ఓటమి చెందగా, 2004లో కాంగ్రెస్, టీఆర్ఎస్ పొత్తులో భాగంగా టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి 41,562 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2009లో తిరిగి కాంగ్రెస్‌లో నుంచి పోటీ చేయగా, టీడీపీ అభ్యర్థి వేణుగోపాలచారి చేతిలో ఓడి మూడోస్థానానికి పరిమితమయ్యారు. 2014లో కాంగ్రెస్ టికెట్ విఠల్‌రెడ్డికి రాగా, ఆయనకు మద్దతుగా నిలిచారు. 2018లో కాంగ్రెస్ టికెట్ కేటాయించకపోవడంతో, ఎన్సీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

# మారుతున్న సమీకరణం

- కాంగ్రెస్‌లోకి.. రేఖ, పటేల్
- ఖానాపూర్, ముధోల్‌లో సీటుపై చర్చ
- బీఆర్ఎస్‌ను వీడిన మాజీ ఎంపీపీ
- జిల్లాలో వేడెక్కుతున్న రాజకీయాలు


కాంగ్రెస్‌లో చేరుతున్న నారాయణ్‌రావుపటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

**నిర్మల్:** ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్, ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ శుక్రవారం రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరి చేరికతో ఆయా నియోజకవర్గాల్లో ఒక్కసారిగా సమీకరణాలు మారాయి. ఇప్పటికీ కాంగ్రెస్ ఆ రెండు చోట్లా టికెట్లు ఖరారు చేయకపోవడం, వీరిద్దరూ పార్టీలో చేరడంతో ఆ దిశగా చర్చ మొదలైంది. మరోవైపు ముధోల్ నియోజకవర్గం 'కారు'లో సద్దుమణిగిందనుకుంటున్న అసమ్మతి మరోసారి తెరపైకి వచ్చింది. మొన్నటి వరకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై అసమ్మతి వ్యక్తంచేసిన నేతలో ఒకరైన కుంటాల మాజీ ఎంపీపీ అరుణ, రమణరావు దంపతులు బీఆర్ఎస్‌కు శుక్రవారం రాజీనామా చేశారు. వీరిద్దరేనా లేక మరికొందరు అసమ్మతి నాయకులు కారు వీడుతారా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**రేఖ 'చేతి'కి ఖానాపూర్..?**

సిట్టింగ్ ఎమ్మెల్యే అయినప్పటికీ బీఆర్ఎస్ రేఖానాయక్‌కు టికెట్ ఇవ్వలేదు. కనీసం ఆమెకు భవిష్యత్తుపై గ్యారెంటీ ఇవ్వలేదు. దీంతో ముందుగా ఆమె భర్త శ్యాంనాయక్ కాంగ్రెస్‌లో చేరారు. కొన్నిరోజులు వేచిచూసిన రేఖానాయక్ చివరకు శుక్రవారం రాహుల్‌గాంధీ సమక్షంలో హస్తంగూటికి చేరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో రేఖానాయక్ కాంగ్రెస్‌లోనే ఆసిఫాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలిగా చేశారు. ఇప్పుడు తిరిగి సొంత పార్టీకే చేరినట్లయింది. తాజా పార్టీలో చేరిన ఆమె బీఆర్ఎస్‌ను ఓడించడమే తన ఏకైక లక్ష్యమన్నట్లుగా మాట్లాడారు. ఇక రేఖానాయక్ చేరికతో ఖానాపూర్ కాంగ్రెస్ టికెట్ వస్తుందన్న ఆశతో ఉన్న నేతలు ఇబ్బందికరంగా మారింది. ఇక్కడి నుంచి వెడ్మ బొజ్జు పటేల్, భరత్ చౌహాన్, వినోద్‌నాయక్, చారులతరాథోడ్ తదితరులు హస్తం టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రేఖానాయక్ చేరికతో పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న సందిగ్ధంలో ఉన్నారు.

**ముధోల్‌లో పటేల్..**

ముధోల్ నియోజకవర్గం నుంచి 1994(టీడీపీ), 2004(టీఆర్ఎస్)లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన భోస్లే నారాయణరావు పటేల్ మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. టీఆర్ఎస్‌లో నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన కాంగ్రెస్‌లో చేరారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ టికెట్ తనకు వరుసకు సోదరుడైన రామారావుపటేల్‌కు ఇవ్వడంతో ఆయన నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ(ఎన్సీపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ముధోల్ కాంగ్రెస్‌లో బలమైన అభ్యర్థి లేకపోవడం, తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయన మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. టికెట్ కూడా దక్కించుకుని బరిలో నిలిచే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ ఇప్పటికే కొత్తగా పార్టీలో చేరిన వైద్యుడు కిరణ్ కొమ్రెవార్ సీటు ప్రయత్నాల్లో ఉన్నారు. అలాగే సీనియర్లు ఆనంద్‌రావుపటేల్, విజయ్‌కుమార్‌రెడ్డి సైతం టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటి దాకా సీటు కోసం ముగ్గురు ఉండగా.. పటేల్ చేరికతో నలుగురి మధ్య పోటీగా మారింది.

**మళ్లీ 'అసమ్మతి'..**

సీఎం కేసీఆర్ తమ అభ్యర్థులను ప్రకటించకంటే ముందు ముధోల్ 'కారు'లో అసమ్మతి తారాస్థాయికి చేరింది. అభ్యర్థిగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వద్దంటూ ఏఎంసీ చైర్మన్ రాజేశ్ నాయక్, పలువురు జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, సీనియర్ నాయకులు అసమ్మతిగళం వినిపించారు. చివరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోక్యం చేసుకుని, ఈసారికీ విఠల్‌రెడ్డినే బరిలో ఉంటారని, ఆయనకు సహకరించాలంటూ వారికి సర్దిచెప్పారు. దీంతో కొంత చల్లబడ్డట్లు కనిపించిన అసమ్మతివర్గంలో తాజాగా కుంటాల మాజీ ఎంపీపీ అరుణ, ఆమె భర్త, సీనియర్ నాయకుడు రమణరావు బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు రాజీనామా చేయడం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. వీరేనా.. లేక వీరితోపాటు గతంలో అసమ్మతి లేవనెత్తిన నేతలూ 'కారు' దిగుతారా.. అన్న చర్చ ముధోల్‌లో మొదలైంది.

### పంట అమ్మకానికి పడిగాపులు..


మార్కెట్ యార్డులో నిరీక్షిస్తున్న రైతులు

**భైంసాటౌన్:** ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసిన రైతన్న చివరకు పంట అమ్ముకోవడానికి కూడా పడిగాపులు తప్పడం లేదు. ఉదయం ఊరు నుంచి పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తెచ్చింది మొదలు టోకెన్ కేటాయింపు, ధర నిర్ణయం, తూకాల వరకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. భైంసాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో రైతులకు పంట అమ్మకాల్లో తిప్పలు తప్పడం లేదు. శుక్రవారం మార్కెట్‌కు 700 లకుపైగా లాట్లు రాగా, సాయంత్రం 3.30 గంటల వరకు ట్రేడర్లు ధర నిర్ణయించ లేదు. దీంతో ఉదయం నుంచి రైతులు మార్కెట్ యార్డులోనే పడిగాపులుకాశారు. మార్కెట్ కమిటీ తరపున రైతుల కోసం మధ్యాహ్న భోజనం వసతి లేకపోవడంతో చాలా మంది పస్తులున్నారు. కొందరు హోటళ్లను ఆశ్రయిస్తుంచారు. ట్రేడర్లు ధర త్వరగా నిర్ణయించి సకాలంలో తూకాలు పూర్తయ్యేలా మార్కెట్ కమిటీ అధికారులు, పాలకవర్గం చొరవ చూపాలని, రైతులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించాలని కోరుతున్నారు.

## 'గెలుపు'నకు బాధ్యతలు !

- నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా సీనియర్లు
- ఎన్నికలు ముగిసే వరకు అక్కడే మకాం
- బీఆర్ఎస్‌లో సమన్వయం చేస్తున్న బాధ్యులు


భైంసాలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌కుమార్

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జీలు తమ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అవసరమైన చోట ఈ ఎన్నికల ప్రచారాన్ని సీనియర్లకు అప్పగించారు. వీరంతా పోలింగ్ ముందు వరకు అక్కడే మకాం వేసి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాల్సి ఉంటుంది. అసంతృప్తులుగా ఉన్న వారికే వ్యూహాత్మకంగా గెలుపు బాధ్యతలు కట్టబెట్టారు. మంచిర్యాల, ఖానాపూర్, బెల్లంపల్లి, బోథ్, ముధోల్ నియోజకవర్గాల్లో సమన్వయ బాధ్యతలను మాజీ ఎంపీ గోడం నగేశ్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుల భుజానికెత్తారు.

**ముధోల్‌లో 'పురాణం'**

ముధోల్ నియోజకవర్గంలో ఉమ్మడి జిల్లాలో సీనియర్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ మూడు రోజుల క్రితమే తన కార్యాచరణ ప్రారంభించారు. పార్టీలో అసంతృప్తులు, కార్యకర్తలను సమన్వయం చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రెండుసార్లు గెలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యేపై ఉన్న వ్యతిరేకత, ప్రతిపక్ష నాయకుల పోటీని తట్టుకుని గెలిపించాల్సిన బాధ్యత 'పురాణం'పై పడింది.

**ఖానాపూర్‌కు దండే విఠల్**

ఎమ్మెల్సీ దండే విఠల్ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పార్టీ ఆదేశాల మేరకు క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఖానాపూర్ నియోజకవర్గ ఎన్నికలకు పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్నేహితుడు భూక్య జాన్సన్‌నాయక్ బరిలో ఉండడంతో మరింత ప్రాధాన్యత ఏర్పడింది. జాన్సన్‌నాయక్ తొలిసారిగా ఎన్నికల బరిలో నిలిచిన తరుణంలో పార్టీలో సీనియర్‌గా ఉన్న విఠల్ సహకరిస్తున్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ పార్టీని వీడడంతో కేడర్‌లో గందరగోళం ఏర్పడింది. ఈ క్రమంలో ఇన్‌చార్జిగా పట్టు నిలిపే ప్రయత్నం చేస్తున్నారు.

**బెల్లంపల్లిలో ఎంపీ వెంకటేశ్ నేత**

బెల్లంపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నువ్వా నేనా అన్నట్లుగా సాగుతున్న తరుణంలో మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను గెలిపించేందుకు ఇన్‌చార్జిగా పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకు బాధ్యతలు అప్పగించారు. ఆయన నియోజకవర్గంలో ప్రచార పని మొదలుపెట్టారు. తన లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ కావడంతో కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేస్తున్నారు.

**బోథ్‌లో మాజీ ఎంపీ**

బోథ్ నియోజకవర్గంలో మాజీ ఎంపీ గోడం నగేశ్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే బాపురావు కాంగ్రెస్‌లోకి వెళ్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ గెలుపు కోసం పనిచేస్తున్నారు. పార్టీ సమావేశాలు, సభల్లో నగేశ్ క్రియాశీలకంగా పని చేస్తున్నారు. అనిల్ లంబాడా, నగేశ్ ఆదివాసీ కావడంతో రెండు వర్గాల్లోనూ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. గతంలో ఎన్నికలు ఎదుర్కొన్న అనిల్‌కు నగేశ్ వంటి సీనియర్ నాయకులు ఎన్నికల్లో కలసి వస్తుందని పార్టీ అంచనా వేసింది.

**మంచిర్యాలలో ఎమ్మెల్సీ**

మంచిర్యాల బాధ్యతలు ఎమ్మెల్సీ భానుప్రసాదరావుకు అప్పగించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే దివాకర్‌రావు గెలుపు కోసం పని చేయడం ప్రారంభించారు. ఆయనతోపాటు మొదట అసంతృప్త నాయకుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి సైతం ఎమ్మెల్యే కోసం నియోజకవర్గంలో పని చేస్తున్నారు.

**మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుపు**

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మా బలం. ఎన్నికల్లో ఇవే ప్రజలకు వివరిస్తాం. పార్టీలో అసంతృప్తి అనేది ఒక కుటుంబంలో వచ్చే తగాదా. రాను రాను అన్నీ సర్దుకుపోతాయి. నియోజకవర్గ బాధ్యులుగా ఇటు పార్టీ, అటు ఓటర్లను సమన్వయం చేస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుస్తారనే నమ్మకం ఉంది.

– పురాణం సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ, ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

**సమన్వయం చేస్తున్నాం**

పార్టీ ఆదేశాల మేరకు ఖానాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేస్తున్నాం. ఇక్కడి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం అందరం కలసి పని చేస్తున్నాం.

– ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి

## జంగ్ తెలంగాణ

## ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

**మామడ/దిలావర్‌పూర్:** బీఆర్ఎస్ పాలనతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మామడల మండలం పొన్కల్ గ్రామంలో, దిలావర్‌పూర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బండలఖానాపూర్ గ్రామం నుంచి పొన్కల్ గ్రామం వరకు, దిలావర్‌పూర్‌లోనూ బైక్‌ర్యాలీలు తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. పొన్కల్‌ను మండలంగా ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షను నెరవేర్చామన్నారు. సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం చేయించామని, అన్ని గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వం అంటే ప్రజలకు ఒక నమ్మకం ఉందన్నారు. బడుగు బలహీనవర్గాల కోసం పనిచే స్తున్న బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. అల్లోల కుటుంబ సభ్యులు రంజిత్‌రెడ్డి, గౌతం రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు పీఏసీఎస్ చైర్మన్ పీవీ.రమణారెడ్డి, పాల్దె అనిల్ పాల్గొన్నారు.

**'సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'**


పొన్కల్‌లో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

**భైంసాటౌన్:** బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ, ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురాణం సతీశ్‌కుమార్ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో భైంసా మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముధోల్ నియోజకవర్గంలో బూత్‌స్థాయి నుంచి పనిచేసి మరోమారు బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. విభేదాలను వీడాలని సూచించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మండలాధ్యక్షుడు భూమారెడ్డి, మండల ఇన్‌చార్జి సూర్యకాంత్‌రెడ్డి, రైతుబంధు కమిటీ జిల్లా అధ్యక్షుడు సదాశివ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృత్తిలో బిజీగా ఉండే వైద్యులంతా.. కాసే పు తమ విధులను పక్కనపెట్టారు. విశ్వనాథ్‌పేట్‌లోని ఐఎంఏ భవన్‌లో శుక్రవారం రాత్రి నిర్మల్ ఐఎంఏ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవం నిర్వహించారు. ఇందులో వైద్యులంతా సంప్రదాయ దుస్తులతో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలుపాడి ఆడారు. - (నిర్మల్)

# వీరులకు వందనం

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- 57మంది ముఖచిత్రాలతో నూతన స్తూపం ఏర్పాటు
- నివాళులర్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి


ఆదిలాబాద్‌లోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్మించిన స్తూపం

**ఆదిలాబాద్‌టౌన్:** పోలీసుల త్యాగం అజరామరం. వారి సేవలు చిరస్మరణీయం. మొక్కవోని ధైర్యసాహసాలకు ఎంతో స్ఫూర్తిదాయకం. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు తమ ప్రాణాలనూ లెక్క చేయకుండా ప్రజల మాన, ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ వారు అందించే సేవలు అనిర్వచనీయం. 'జాతీయ చిహ్నంలోని మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతీకలైతే.. కనిపించని నాలుగో సింహమే పోలీస్' అనే సినీ డైలాగ్ పోలీసుల విద్యుధర్మానికి ప్రతీకగా నిలుస్తోంది. సమాజానికి రక్షణ కవచంలా నిలుస్తూ వారందించే సేవలను చాటి చెబుతోంది. జిల్లాను శాంతియుతంగా ఉంచేందుకోసం జరిగిన పలు ఘటనల్లో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేలా పోలీస్‌శాఖ ఏటా అక్టోబర్ 21వ తేదీన అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. సమాజంలో పోలీసుల పాత్ర, వారి సేవలను చాటి చెప్పేలా విద్యార్థులకు వివిధ పోటీలతో పాటు రక్తదాన శిబిరాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తగా 57మంది అమరుల ఫొటోలతో కూడిన స్తూపాన్ని ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలపై కథనం.

**సీఆర్పీఎఫ్ జవాన్ల స్మారకార్థమే..**

1959 అక్టోబర్ 21న లడక్ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారు. వీరి స్మారకార్థంగా ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవాలని 1960 జనవరిలో జరిగిన రాష్ట్రాల పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ సమావేశంలో నిర్ణయించారు. అప్పటినుంచి విధి నిర్వహణలో అమరులైన వారిని స్మరిస్తూ సంస్మరణ దినం నిర్వహిస్తున్నారు.

**పోలీసు అమరులు వీరే..**

పీ చక్రపాణి (సీఐ), ఎస్సైలు సీహెచ్ లక్ష్మణ్‌రావు, టీ రాజన్న, బీ కోట్యానాయక్, అహ్మద్ షరీఫ్, ఎస్.మల్లేశ్, సయ్యద్ ఖాదీర్ ఉల్‌హక్, సీహెచ్ మదన్‌మోహన్ (ఏఎస్సై), హెడ్ కానిస్టేబుళ్లు ఎం.లక్ష్మణ్, ఎంఏ గఫార్, ఎండీ జాహురొద్దీన్, ఎంఏ జలీల్, ఎస్కే హైదేర్, తాహెర్ మహ్మద్, ఏ గోవర్ధన్, సయ్యద్ హమీదొద్దీన్, జానారావు, ఏ సంజీవరెడ్డి, జీ శేషయ్య, కానిస్టేబుళ్లు ఎస్ఎస్.చారి, అశోక్‌రావు, కే జగన్నాథ్‌రావ్, విఠల్‌సింగ్, జే ముకుంద్‌రావ్, పీ రఘునాథ్, ఎంఏ జావిద్, జీ బాపురావ్, వేణుగోపాల్, బోజరాం, మోహన్‌దాస్, గణపతి, సాగిర్ అహ్మద్, కే అశోక్, జే సతీశ్‌బాబు, మంగీలాల్, సీ రామారావు, అంకమ్‌రావు, ఆర్.కబీర్‌దాస్, ఎం.గోవింద్‌రావ్, ఆర్.శంకర్, ఆర్.ఓంకార్, కే సుభాష్, శివశంకర్, కే రాజేశ్వర్, పూనమ్‌చంద్, ఆర్.నర్సయ్య, ఏ భీంరావ్.

**అమరుల త్యాగాలకు గుర్తుగా..**

- సీఐ చక్రపాణి జ్ఞాపకార్థం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో చక్రపాణి మెమోరియల్ హాల్ నిర్మించారు.
- 1987 ఆగస్టు 18న అల్లంపెల్లి ఘటనకు గుర్తుగా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో అల్లంపెల్లి కాంప్లెక్స్ నిర్మించారు.
- బెల్లంపల్లి పాతబస్తీ ఘటనలో అసువులు బాసిన హెడ్‌కానిస్టేబుళ్లు సంజీవ్‌కుమార్, శేషు జ్ఞాపకార్థం పోలీసు వ్యాయామశాల ఏర్పాటు చేశారు.
- ఉట్నూర్ కొమ్ముగూడెం ఘటనలో మరణించిన ఎస్సై బీ కోట్యానాయక్ స్మారకార్థం చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేశారు.
- ఖానాపూర్ పోలీసుస్టేషన్‌లో ఎస్సై మల్లేశ్ జ్ఞాపకార్థం స్తూపం నిర్మించారు. ఇలా జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఏ భవన నిర్మాణం చేపట్టిన వాటికి అమరవీరుల పేర్లు పెడుతున్నారు.

### సంఘటనలు ఇవీ..

- 1987 ఆగస్టు 18న కడెం మండలం అల్లంపెల్లిలో జరిగిన మొదటి ఎన్‌కౌంటర్‌లో నక్సలైట్ల దాడిలో ఇద్దరు ఎస్సైలు, 10 మంది కానిస్టేబుళ్లు అమరులయ్యారు.
- 1989 ఫిబ్రవరి 1న ఖానాపూర్–కడెం మండలాల్లోని సింగాపూర్ అడవుల్లో పోలీసు జీపును మందుపాతరతో పేల్చివేసి న ఘటనలో ఒక ఎస్సై, ఏడుగురు పోలీసులు మరణించారు.
- 1991 మే 17న ఉట్నూర్‌లోని కొమ్ముగూడెంలో జరిగిన ఘటనలో ఎస్సై కోట్యానాయక్, ఇద్దరు పోలీసులు అమరులయ్యారు.
- 1996 జూన్ 23న సీసీసీ నస్పూర్ కాలనీలోని ఓ ఇంట్లో నక్సలైట్లు ఉన్న సమాచారం తెలుసుకున్న శ్రీరాంపూర్ సీఐ చక్రపాణి, కానిస్టేబుల్ అశోక్ అక్కడికి వెళ్లడంతో నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో వీరిద్దరూ మరణించారు.
- 1996 నవంబర్ 15న సిర్పూర్(యూ) పోలీసు స్టేషన్ పేల్చివేసిన ఘటనలో ఎస్సై అహ్మద్ షరీఫ్‌తో పాటు 12మంది పోలీసులు చనిపోయారు.
- 1998 మే 28న బెల్లంపల్లి పాతబస్తీ దగ్గర సికాస (సింగరేణి కార్మిక సమాఖ్య) పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో హెడ్‌కానిస్టేబుళ్లు సంజీవ్‌కుమార్, శేషు మరణించారు.
- 1999 డిసెంబర్ 2న ఖానాపూర్ మండలం తార్లపాడు వద్ద మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ఖానాపూర్ ఎస్సై సింగం మల్లేశ్, కానిస్టేబుల్ పున్నంచంద్ అమరులయ్యారు.

### నియోజకవర్గానికో హెల్ప్‌డెస్క్

- కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

**నిర్మల్‌చైన్‌గేట్:** ఎన్నికలకు సంబంధించి ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలోని ఈవీఎం గోదాంను వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం ఈవీఎంల మొదటి రాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఆన్‌లైన్ విధానం ద్వారా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ల రాండమైజేషన్ నిర్వహించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం బ్యాలెట్ యూనిట్స్ 1,151, కంట్రోల్ యూనిట్స్ 1,151, వివిప్యాట్స్ 1,290 కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. శనివారం నియోజకవర్గాల పరిధిలోని స్ట్రాంగ్ రూములకు తరలిస్తామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో లోకేష్, మూడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రత్నకల్యాణి, జీవాకర్, కోమల్‌రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వృద్ధుడి మృతదేహం లభ్యం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. వృద్ధుడి వయస్సు 60 నుంచి 65 మధ్య ఉంటుందని, దోతి, ఫుల్ షర్ట్ ధరించినట్లు పేర్కొన్నారు.

### ఆర్టీసీ డిపోలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళ కండక్టర్లు

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో గురువారం రాత్రి బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళా కండక్టర్లు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, పూజించారు. డీజే పాటల మధ్య కోలాటం ఆడారు. అనంతరం ఊరేగింపుగా బంగల్‌పేట్ వినాయక సాగర్ వరకు వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. డిపోలో బతుకమ్మను నెలకొల్పి పండుగ నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు రాజశేఖర్, శ్రీకర్, మహిళా కండక్టర్లు, డ్రైవర్లు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంట్లోకి దూసుకొచ్చిన అడవిపంది



ఇంటి ఆవరణలో సంచరిస్తున్న అడవిపంది

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామంలో శుక్రవారం పంటచేల వైపు నుంచి దారితప్పి వచ్చిన అడవిపంది గ్రామంలోని ఇళ్లల్లోకి దూసుకొచ్చింది. పెన్‌గంగనది వైపు నుంచి వచ్చిన అడవిపంది నేరుగా గ్రామంలోకి వచ్చి పలు ఇళ్లలోకి చొరబడింది. గ్రామానికి చెందిన అంబే పాండ్‌రంగ్ ఇంట్లోకి వెళ్లడాన్ని గుర్తించిన గ్రామస్తులు కర్రలతో అడవిపందిని వెళ్లగొట్టారు. ఒక్కసారిగా గ్రామంలోకి అడవిపంది రావడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

### 'మిస్' రన్నరప్‌గా నిర్మల్ యువతి



నిషిత తిరునగరి

నిర్మల్: ఫ్యాషన్‌రంగంపై మక్కువతో అందులో ఎదుగుతున్న నిర్మల్ యువతి అరుదైన స్థానంలో నిలిచింది. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన ×మిస్ క్వీన్ ఆఫ్ ది వరల్డ్ ఇండియా–2023× పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన నిషిత తిరునగరి ఒక్క మార్కు తేడాలో రన్నరప్‌గా నిలిచింది. స్థానిక ఈద్‌గాంకు చెందిన సరళ, మనోహర్‌స్వామి దంపతుల కూతురు నిషిత బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ చదివింది. భవిష్యత్తుపై తనకున్న నమ్మకం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఫ్యాషన్‌రంగంలోకి అడుగుపెట్టింది. ఆమె 18రాష్ట్రాల మహిళలు, యువతులకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్‌డిఫెన్స్ కోర్సును నేర్పిస్తుండడం గమనార్హం. ఢిల్లీలో జరిగిన పోటీల్లో నిషిత రన్నరప్‌గా నిలువడంపై కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# స్వతంత్రుల సత్తా..



- ఉమ్మడి జిల్లా నుంచి తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులు
- పెద్ద పార్టీల అభ్యర్థులను తట్టుకుని ఎన్నికల్లో విజయం
- ప్రజల మద్దతుతో ఎన్నికల్లో సులభంగా గెలుపు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలుమార్లు ఎన్నికల్లో ప్రజలు స్వతంత్ర అభ్యర్థులకు పట్టం కట్టారు. పార్టీలకు అతీతంగా కేవలం అభ్యర్థులపై ఉన్న నమ్మకం, వారితోనే తమ అభివృద్ధి ఉంటుందని ఆశించి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మందిని జిల్లా ప్రజలు గెలిపించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు, నిర్మల్ జిల్లాలో ముగ్గురు, మంచిర్యాల జిల్లాలో ఇద్దరు, కుమురంభీం జిల్లా నుంచి ఒక్కరు మొత్తం తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులు వారి సత్తా చాటి ఎన్నికల్లో ప్రజల అశీర్వాదం పొందారు.

### ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు



సి. రాంచంద్రారెడ్డి




సి. వామన్ రెడ్డి

ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొంది అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటారు. 1962–67లో విఠల్‌రావు దేశ్‌పాండే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 13,949 ఓట్లు సాధించగా ప్రత్యర్థిగా పోటీ చేసిన కె. రాంకిష్టు సీపీఐ నుంచి పోటీ చేసి 12,895 ఓట్లు సాధించారు. అనంతరం 1978–83, 1985–89లలో సి.రాంచంద్రారెడ్డి, 1983–85లలో సి.వామన్‌రెడ్డిలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందారు.

### మంచిర్యాల జిల్లాలో ఇద్దరు.. లక్సెట్టిపేట్‌లో ఇద్దరు గెలుపు



జివి పితాంబర్‌రావు



జివి సుధాకర్‌రావు

ప్రస్తుత మంచిర్యాల అప్పటి లక్సెట్టిపేట్ నియోజకవర్గం నుంచి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. జీవీ పితాంబర్‌రావు 1962–67లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. జివి పితంబర్‌రావుకు 24,027 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ప్రత్యర్థి అభ్యర్థి జీవీ నర్సింగరావుకు 20,153 ఓట్లు వచ్చాయి. 1985లో జివి సుధాకర్‌రావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా, 43,140 ఓట్లు సాధించాడు. ప్రత్యర్థి అభ్యర్థి టీడీపీ పార్టీకి చెందిన సి.కృపాకర్‌కు 27,921 ఓట్లు రాగా జీవీ సుధాకర్‌రావు గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1989లో కాంగ్రెస్ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

### నిర్మల్ జిల్లాలో ముగ్గురు



గోవింద్ నాయక్



గడ్డిగారి గడ్డెన్న



కొరిపెల్లి ముత్యంరెడ్డి

నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, ముథోల్, నిర్మల్ నియోజకవర్గాల నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి పలువురు సత్తా చాటారు.

- ఖానాపూర్ నియోజకవర్గానికి 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జాలం సింగ్‌పై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన గోవింద్ నాయక్ గెలుపొందారు. గోవింద్ నాయక్‌కు 22,014 ఓట్లు రాగా, బానోతు జాలం సింగ్‌కు 13,512 ఓట్లు వచ్చాయి. ఆ తరువాత గోవింద్ నాయక్ టీడీపీలో చేరారు.
- ముథోల్ నియోజకవర్గంలో 1967లో గడ్డిగారి గడ్డెన్న 1967, 1972లో రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1967లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన గడ్డెన్నకు 34,610 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన జీజీ రెడ్డికి 11,701 ఓట్లు వచ్చాయి. 1972లో మాత్రం గడ్డెన్న స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- నిర్మల్ నియోజకవర్గం నుంచి తొలి ఎమ్మెల్యే కొరిపెల్లి ముత్యంరెడ్డి 1957 స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్ దేశ్‌పాండే అనే కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు.

### కొమురంభీం జిల్లాలో సిర్పూరు నుంచి ఒక్కరు



పురుషోత్తం

కొమురంభీం జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గం నుంచి పాల్వాయి పురుషోత్తం రావు రెండు సార్లు సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొంది సత్తా చాటారు. 1989, 1994లో టీడీపీ అభ్యర్థి కేవీ నారాయణరావుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పురుషోత్తం రావు గెలుపొందారు. పాల్వాయి పురుషోత్తంరావు బెజ్జూరు మండలంలోని రెబ్బెన గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్‌గా, సింగిల్ విండో చైర్మన్‌గా, ఎంపీపీగా తన రాజకీయాన్ని ప్రారంభించి, ఆ తరువాత స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలుపొందారు. రాజకీయాల్లో తనదైన శైలిలో ముద్రవేశారు. 1989లో టీడీపీ నుంచి టికెట్ ఆశించినా కేవి నారాయణ రావుకు దక్కడం, 1994లో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించగా కేశవులకు టికెట్ దక్కడంతోనే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

### ముగ్గురు ఎమ్మెల్యేలూ న్యాయవాదులే..

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బీకామ్ ఎల్ఎల్‌బీ
- ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బీఏ ఎల్ఎల్‌బీ
- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖశ్యాం నాయక్ ఎంఏ ఎల్ఎల్‌బీ



అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



గడ్డిగారి విఠల్‌రెడ్డి



రేఖ శ్యాంనాయక్

భైంసా: నిర్మల్ జిల్లాలో 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులుగా పోటీ చేసి గెలిచిన ముగ్గురూ న్యాయవాదులే. గతంలో వీరంతా ఈ వృత్తిలో పనిచేసిన వారే. నిర్మల్ ఎమ్మెల్యే, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బీ.కామ్ ఎల్ఎల్‌బీ చదివారు. ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా కూడా ఉన్నారు. ముథోల్ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి బీఏ ఎల్ఎల్‌బీ చదివారు. ఆయన తండ్రి దివంగత నేత గడ్డెన్న మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో భైంసా కోర్టులోనే న్యాయవాదిగా పనిచేశారు. ఇక ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖాశ్యాంనాయక్ సైతం ఎంఏ ఎల్ఎల్‌బీ చదివారు.

### తల్లి, బిడ్డ మిస్సింగ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌కు చెందిన తల్లి, బిడ్డ మిస్సింగ్ అయినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన మహిళ మహారాష్ట్రలోని కిన్వట్‌కు పుట్టింటికి వెళ్తనని కుటుంబ సభ్యులకు చెప్పి చిన్న కుమారుడిని తీసుకుని గురువారం ఇంటి నుంచి వెళ్లింది. పుట్టింటికి వెళ్లకపోవడంతో విషయం తెలుసుకున్న భర్త బాలరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

## ఎస్సీ వర్గీకరణ కోసమే రథయాత్ర

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ



మందకృష్ణకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణతో మాదిగ జీవితాల్లో వెలుగులు నింపేందుకే రథయాత్ర చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ కాలనీలో నిర్వహించిన మాదిగల విశ్వరూప సన్నాహక మహాసభ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్, బొక్కల గూడా, మున్సిపల్ కాలనీ మాదిగ కాలనీలలో పర్యటిస్తూ ఖానాపూర్‌లో ఆరెల్లి మల్లేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక మహాసభలో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అన్ని పార్టీలు సమర్థిస్తూ వస్తున్నప్పటికీ వర్గీకరణ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయన్నారు. అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామని చెప్పిన పార్టీలు తీరా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మద్దతు ప్రకటించిన పార్టీలు ఇప్పుడు మౌనం వహించి వర్గీకరణ బిల్లును పార్లమెంటులో చట్టబద్ధత కల్పించేందుకు చొరవ చూపెట్టకుండా మోసగిస్తున్నారన్నారు. విధానానికి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల గుండా ఆదిలాబాద్ టు హైదరాబాద్ పేరుతో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం కోసమే జిల్లా కేంద్రం నుంచి రథయాత్ర మొదలు పెట్టినట్లు వివరించారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన కోల్పోయిన మాదిగలకు ఒరిగేదేమీ లేదని, జాతికి వందేళ్ల భవిష్యత్‌కు శాశ్వత పరిష్కారమైన వర్గీకరణ మాత్రమే మాదిగల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పాలెపు గణేష్ జిల్లపల్లి నవీన్, శ్రీను, సూర్యకాంత్, ప్రేమేందర్, ఆదిలాబాద్ పట్టణ కమిటీ సభ్యులు కంపల్లి సుదర్శన్, చిర్ర జాన్సన్, సురేష్, మోహన్, గణేష్, దయాకర్, నవీన్, దినకర్ ఉన్నారు.

## మహిళ ప్రాణాలు కాపాడిన యువకులు

- కడెం ప్రాజెక్ట్‌లో దూకేందుకు సిద్ధమైన మహిళ



వజ్రవ్వను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కడెం: కడెం ప్రాజెక్ట్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడేందుకు యత్నించిన ఓ మహిళ ప్రాణాలు కాపాడారు కడెం యువకులు. గంగాపూర్ గ్రామానికి చెందిన పిట్ల రాజన్న కూతురు వజ్రవ్వ(వనిత)ను నాలుగేళ్ల క్రితం మండలంలోని మాసాయిపేట్ గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేశారు. వజ్రవ్వ శుక్రవారం సాయంత్రం ప్రాజెక్ట్‌లో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు కుడి కాలువ గోడపై కూర్చుని ఉంది. సమీపంలో ఉన్న మండల కేంద్రానికి చెందిన యువకులు ఫైజల్, తైసీన్, సైపులాషన్, శేక్ ఆఫ్సర్, ఎండీ పాషాలు అనుమానంతో వజ్రవ్వ వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుని అమెను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కె.రాజు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. భర్త వేధింపులతోనే తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు బాధితురాలు పేర్కొంది.

## భక్తజన బాసర

- మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారి దర్శనానికి తరలి వచ్చిన భక్తులు
- గంటల తరబడి క్యూలైన్లలో బారులు
- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- కాత్యాయిని రూపంలో అమ్మవారు



విద్యుత్ కాంతుల్లో ఆలయం

భైంసా: చదువుల తల్లి క్షేత్రమైన బాసరలో శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. దసరా ఉత్సవాల్లో అత్యంత శుభ ముహూర్తమైన మూలనక్షత్రం పర్వదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బాసర సరస్వతీ అమ్మవారికి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ శరత్‌పాఠక్, ఈవో విజయ రామారావు పట్టువస్త్రాలు సమర్పించారు. నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాసర సరస్వతీ అమ్మవారి పాదాలచెంత బీఫాం ఉంచి పూజలు చేశారు. ఉదయం వేళ ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పూజలు చేశారు. బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు బోస్లే మోహన్‌రావుపటేల్‌తోపాటు పలువురు సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. గోదావరిలో స్నానాలు చేసి గంగమ్మతల్లికి పూజలు చేశారు. ఆదిలా బాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి భక్తులు పాదయాత్రగా బాసరకు చేరుకున్నారు.

**గంటలపాటు క్యూలైన్లలో..**

ఆలయ ప్రాంగణంలో గంటల తరబడి భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. భక్తులకు ఎస్‌బీహెచ్, ఆంధ్రాబ్యాంకు, దక్కన్‌గ్రామీణ బ్యాంకులు సేవలు అందించాయి. పాలు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. భైంసా బృందం భక్తులకు పులిహోర పంపిణీ చేసింది. గదులు దొరకక సామాన్యులు ఇబ్బంది పడ్డారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన వ్యాపార సంఘం సభ్యులు, బాసర యువకులు పలువురు ప్రత్యేక సేవలు అందించారు.

**ప్రత్యేక బందోబస్తు...**

ఉత్సవాల్లోభాగంగా బాసర ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**కాత్యాయిని అలంకరణలో..**

బాసర సరస్వతీ అమ్మవారు కాత్యాయిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి గవ్వకేసరి నైవేద్యంగా సమర్పించారు.

**బాసరలో 2,660 అక్షరాభ్యాసాలు**

మూలనక్షత్రం శుభదినం సందర్భంగా 2,660 చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు. 1,740 మంది చిన్నారులు రూ.1000 అక్షరాభ్యాసమండపంలో, 920 మందికి రూ.150 అక్షరాభ్యాస మండపంలో పూజలు చేశారు. ప్రత్యేక దర్శనంతో రూ. 1.90 లక్షలు, మండప ప్రవేశంతో రూ.39,300, అభిషేకం, లడ్డూ ప్రసాదాలతో రూ. 5,55,000, పులిహోర ప్రసాదంతో రూ.2.50 లక్షల ఆదాయం సమకూరింది. వసతిగృహాలు, అక్షరాభ్యాసాలు, ప్రసాదాలు ఇతర పూజలతో బాసర ఆలయానికి రూ. 32,87,300 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విజయరామరావు తెలిపారు.



క్యూలైన్‌లో భక్తులు



పూజలో పాల్గొన్న భక్తులు



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటూ..



### బోనాల పండుగలో దివ్యారెడ్డి



లోకల్ వెల్మల్ గ్రామంలో బోనంతో దివ్యారెడ్డి

సోన్: మండలంలోని లోకల్‌వెల్మల్ గ్రామంలో దేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కోడలు అల్లోల దివ్యారెడ్డి బోనాల పండుగ ఉత్సవాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి బోనం, సారే పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



రెయాన్ మృతదేహం

జైనథ్: మండలంలోని పెండల్‌వాడ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెయాన్(3) మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని పాతన్‌బోరికి చెందిన ఉప్పల్‌వార్ ఉమేష్ అతడి కుమారుడు రెయాన్‌తో కలిసి బైక్‌పై జైనథ్ మండలం మేడిగూడ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వారు పెండల్‌వాడ సమీపంలో జైనథ్ నుంచి బైక్‌పై ఎదురుగా వచ్చిన రుణేష్ ఢీకొన్నాడు. దీంతో తండ్రి, కొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

### రుద్రాభిషేకంలో ఎమ్మెల్యే



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఆదిలాబాద్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ కాలనీలోని శివాలయంలో నిర్వహించిన రుద్రాభిషేకంలో ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు పాల్గొన్నారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వేదపండితుడు ప్రవీణ్, ఆలయ అర్చకుడు వివేక్ స్వామి ఉన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- దగ్ధమైన లారీ



దగ్ధమవుతున్న లారీ

నిర్మల్‌రూరల్: జాతీయ రహదారిపై నిలిపి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొనగా మంటలు వ్యాపించి లారీ దగ్ధమైంది. ఈ ఘటన మండలంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం... చెన్నై నుంచి ఉత్తరప్రదేశ్‌కు టూవిల్లర్ టైర్ల లోడుతో వెళ్తున్న లారీ, నిర్మల్‌రూరల్ మండలంలోని సీ లాయపేట శివారులో జాతీయ రహదారిపై ఆగి ఉన్న మరో లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో టైర్ల లోడుతో ఉన్న లారీకి ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పివేశారు. లారీలోని టైర్లు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.26లక్షల నష్టం వాటిల్లిందని ఎస్సై పేర్కొన్నాడు. జాతీయ రహదారిపై ఎలాంటి ఇండికేటర్ లేకుండా నిలిపి ఉంచిన లారీ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై వర్క్‌షాప్



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ

భైంసా: ప్లాస్టిక్‌వ్యర్థాల వినియోగంపై హైదరా బాద్‌లోని గచ్చిబౌలిలో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్‌తోపాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నా రు. బాసర ట్రిపుల్‌ఐటీ, ఎన్వీరాల్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్లాస్టి క్ వ్యర్థాల వినియోగంపై అవగాహన కల్పించా రు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వాహణ సముద్రకా లుష్యం, బయోమైనింగ్ టోర్‌ఫాక్షన్, బయోమెడికల్, వ్యర్థాలతో ఎదురయ్యే సవాళ్లపై వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మార్గనిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాపులో అధ్యాపకులు డాక్టర్ వినోద్, రామేశ్‌రెడ్డి, సృజన, నరేందర్, రాహుల్ పాల్గొన్నారు.